RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



3 లో

నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించడమే కూటమి లక్ష్యం

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :236 సంపాదకులు: కలిచేటి వెంకయ్య బుధవారం 22 జులై 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

## రాహుల్ గాంధీ మాట మార్చారు

కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

నీట్‌పై చర్చ విషయంలో రాహుల్ గాంధీ మాట మార్చారని కేంద్రం ఆరోపణ

ప్రధాని నివాసం సమీపంలో కాంగ్రెస్ నిరసన.. పాల్గొన్న రాహుల్, ప్రియాంక

ధర్నా వద్దకు వెళ్లి రాహుల్‌తో మాట్లాడిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

మంత్రుల రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్.. చర్చలు విఫలమయ్యాయని ప్రకటన



**న్యూఢిల్లీ:**నీట్-యూజీ పరీక్ష వివాదంపై పార్లమెంటులో చర్చకు సిద్ధమని చెప్పినా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చివరి నిమిషంలో మాట మార్చారని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. దీంతోప్రతిష్టంభన ఏర్పడిందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు రాహుల్ కట్టుబడలేదని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి కొత్త షరతులు పెట్టడంతో చర్చలు ముందుకు సాగలేదని ఆయన

మిగతా 2లో...

# విద్యార్థుల ఆందోళనల వేళ..

నీట్ లీక్‌పై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

నీట్ పేపర్ లీక్ దోషులకు అత్యంత కఠిన శిక్ష విధించాలన్న ప్రధాని మోదీ

పరీక్షల నిర్వహణకు పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించాలని సూచన

పార్లమెంటు ముట్టడికి యత్నించిన విద్యార్థులపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆందోళనకారుల డిమాండ్

నిరసనకారులతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా చర్చలు.. కొనసాగుతున్న ఉత్కంఠ



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారికి అత్యంత కఠినమైన శిక్ష విధించాలని ఆయన పిలుపునిచ్చారు. పేపర్ లీక్‌లను నిరోధించడం జాతీయ బాధ్యత అని ఉద్ఘాటించారు. ఇవాళ జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం అనంతరం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేని పటిష్ఠమైన (ఫూల్‌ప్రూఫ్) వ్యవస్థను నిర్మించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రధాని కోరినట్లు రిజిజు తెలిపారు.

చట్టసభల్లో ప్రభుత్వానికి మద్దతుగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ఐక్యంగా ఉండాలని ప్రధాని కోరారు. అదే సమయంలో ప్రతిపక్షాలు కూడా పార్లమెంటులో నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని, దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం ఎంపీలందరిపైనా ఉమ్మడి బాధ్యత ఉందని మోదీ అన్నట్లు రిజిజు వివరించారు.

నీట్ కుంభకోణంపై విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిన్న పార్లమెంటు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన వందలాది మంది విద్యార్థులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి, లాఠీఛార్జ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను 'బొద్దింకలతో' పోల్చిన వ్యాఖ్యల నేపథ్యంలో ఏర్పడిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తోంది.

మిగతా 2లో...



## కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో మంత్రి అచ్చెన్నాయుడు భేటీ

ఆంధ్రప్రదేశ్ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిపై విస్తృత చర్చ

రైతులకు గిట్టుబాటు ధరలు, పంటల కొనుగోళ్లు, వ్యవసాయానికి కేంద్ర సహకారంపై కీలకంగా చర్చ

న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ

మిగతా 2లో...

## ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు నాంది

ఏపీ ఈడీబీతో యూఏఈ అవగాహనా ఒప్పందం

ఫుడ్ ప్రాసెసింగ్ లో యూఏఈ పెట్టుబడులకు మార్గం సుగమం

వాణిజ్యం, ఎగుమతులు, పెట్టుబడులకు యూఏఈ క్లస్టర్ సహకారం

తొలి పెట్టుబడిగా చిత్తూరులో యూఏఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

రూ.100 కోట్లతో పెట్టుబడితో ముందుకు వచ్చిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్

సీఎం చంద్రబాబు, యూఏఈ మంత్రి అబ్దుల్లాబిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఓయూ



**అమరావతి, సింధూరదర్శిని:**

ఈ ఏడాది దావోస్ లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో కుదుర్చుకున్న మరో ఒప్పందం ఇవాళ సాకారమైంది. యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఏపీలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులను పెట్టేలా ఏపీ ఈడీబీ-యూఏఈకి చెందిన ఫుడ్ క్లస్టర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈమేరకు రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, యూఏఈ ఆర్థిక, పర్యాటక విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ

మిగతా 2లో...



## 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది

- వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందన్న నిమ్మల

-నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శ

-ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు బాగుపడుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్య

**అమరావతి, సింధూరదర్శిని:**

2019లో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని... కానీ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలన వల్ల ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయని పేర్కొన్నారు. సచివాలయంలో జలవనరుల శాఖపై ఈరోజు ఆయన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులు, వాటి తాజా స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు. 2014-19 మధ్యకాలంలో పోలవరం పనులు వేగంగా జరిగి 72 శాతం మేర పూర్తయ్యాయని, అయితే జగన్ 'ఒక్క ఛాన్స్' అంటూ వచ్చి రివర్స్ టెండరింగ్ పేరుతో తీవ్ర నష్టం చేశారని విమర్శించారు. కాంట్రాక్టు ఏజెన్సీలను రద్దు చేయవద్దని ఎంతమంది హెచ్చరించినా వినకుండా, 17 నెలల పాటు పనులను నిలిపివేశారని మండిపడ్డారు. దీని ఫలితంగానే 2020లో వచ్చిన వరద లకు డయాఫ్రమ్ వాల్ పూర్తిగా దెబ్బతిన్నదని నిపుణులు స్పష్టం చేశారని తెలిపారు. ఆఖరికి పోలవరం నిర్వా సితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని దుయ్య బట్టారు. ధ్వంసమైన జలవనరుల రంగాన్ని పునర్నిర్మించి పూర్వ స్థితికి తీసుకువస్తున్నామని మంత్రి

మిగతా 2లో...

## మంగళగిరిని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

-బట్టలు పెట్టి పట్టాలిస్తానన్న ప్రధాన హామీని నెరవేర్చా

-మంగళగిరి ప్రజలు ఇచ్చిన బలమే ముందుకు నడిపిస్తోంది

-ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా కూటమి అడుగులు

-మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్



వివరాలు 2 లో

# కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో మంత్రి అచ్చెన్నాయుడు భేటీ

(మొదటిపేజీ తరువాయి)

రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమం, పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, మార్కెటింగ్ సదుపాయాల బలోపేతం, రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి తదితర కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులకు సాగు సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవసాయ శాఖ పనిచేస్తోందని, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలు ప్రత్యక్షంగా వ్యవసాయంపై, మరోవైపు ఉద్యానవనం, పాడి పరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్య, ఆక్వా తదితర అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ఉత్పాదకత పెంపుతో పాటు పంటల మార్కెటింగ్, నిల్వ, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రైతు పండించిన పంటకు సరైన ధర లభించేలా మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పంటల సాగులో పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలు రైతులపై ఆర్థిక భారాన్ని పెంచుతున్న నేపథ్యంలో, రైతులకు సాగు ఖర్చులు తగ్గించే విధంగా కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్స్ అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు, పంటల ఉత్పత్తి వ్యయం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు మెరుగైన ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంటల కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు.

అదేవిధంగా వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, అనావృష్టి, అధిక వర్షాలు, తుపాన్లు తదితర కారణాలతో రైతులు ఎదుర్కొంటున్న నష్టాలను కూడా మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు తక్షణ సహాయం అందించడంతో పాటు పంట నష్టపరిహారం, బీమా ప్రయోజనాలు సకాలంలో అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం అవసరమని తెలిపారు. రైతులకు భరోసా కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు సహకరించాలని కోరారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా చర్చించారు. డ్రోన్ టెక్నాలజీ, డిజిటల్ వ్యవసాయం, ఆధునిక సాగు పద్ధతులు, మట్టి ఆరోగ్య పరిరక్షణ, నీటి సమర్థ వినియోగం, పంటల ఉత్పాదకత పెంపు వంటి అంశాల ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కల్పించవచ్చని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. చిన్న, సన్నకారు రైతులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర సహకారం అవసరమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించేందుకు, పంటల నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు, గోదాములు, శీతల గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు. రైతులు కేవలం పంట ఉత్పత్తిదారులుగా కాకుండా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో భాగస్వాములు అయ్యే విధంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన వ్యవసాయ రంగ సమస్యలు, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు.

రైతుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అభినందించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించేందుకు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయడం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయవచ్చని ఇరువురు నేతలు అభిప్రాయపడినట్లు తెలిపారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన ఇన్‌పుట్స్ అందించడం నుంచి పంట చేతికొచ్చిన తర్వాత మార్కెటింగ్ వరకు ప్రతి దశలో ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు నాంది



(మొదటిపేజీ తరువాయి)

సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు, విదేశీ వాణిజ్యం సహా యూఏఈకి చెందిన సంస్థలు పెట్టుబడులు పెట్టేలా ఈ ఒప్పందం కుదిరింది. ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబుతో యూఏఈ ప్రతినిధుల బృందం చర్చలు జరిపింది. ఈ ఏడాది జనవరిలో దావోస్ పర్యటనలో ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆహారశుద్ధి రంగంలో ఏపీలో వ్యాల్యూ చైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటు చేస్తూ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మామిడి, అరటి, కోకో లాంటి వివిధ ఉద్యాన ఉత్పత్తులకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విలువ జోడించిన ఉత్పత్తుల ఎగుమతులు, వాణిజ్యం లాంటి అంశాల్లో ఈ ఎంఓయూ సహకరించనుంది. ఈ ఒప్పందంలో తొలి అడుగుగా యూఏఈకి చెందిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఏపీలోని చిత్తూరులో రూ.100 కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చింది. చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్న ఈ సంస్థ ప్రపంచ శ్రేణి ఉత్పత్తులను తయారు చేయనుంది. దుబాయ్, యూఏఈ కేంద్రంగా పనిచేస్తున్న ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ దాదాపు 25 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఏపీలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి కూడా అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయనుంది.

### క్వాంటం స్పీడ్ తో అవకాశాలు అందుకోండి

దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనపరిచిన యూఏఈ ఆరు నెలల్లోగా వాటిని సాకారం చేసే దిశగా ముందుకు వచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులకు ఏపీ వేదిక కావటం సంతోషదాయకమని సీఎం వ్యాఖ్యానించారు. ఉద్యాన, ఆక్వా, ఐటీ రంగాల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలోని వైవిధ్యమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఏడాది పొడవునా వివిధ రకాల ఉద్యాన ఉత్పత్తులు సాగు చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్ర స్థూల ఆదాయంలో 30 శాతం మేర ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా వస్తోందని చెప్పారు. రూ. 1 లక్ష కోట్ల ప్రభుత్వం, ప్రైవేటు పెట్టుబడితో రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తున్నామని తెలిపారు. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్-×ూూను కూడా ఏర్పాటు చేయనున్నట్టు సీఎం వివరించారు. 200కు పైగా ఉద్యాన క్లస్టర్లతో అక్వా మిర్చి, పామాయిల్, కోకో, కాఫీ తదితర పంటల్లో ఏపీ ఎగుమతులు చేస్తోందని సీఎం యూఏఈ ప్రతినిధి బృందానికి వివరించారు. కృష్ణా-గోదావరి డెల్టాలో నిరంతర నీటి సరఫరా కారణంగా వ్యవసాయ ఉత్పత్తి సాధించగలుగుతున్నామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీకి ఓవిధానంగా మారిపోయిందని తెలిపారు. ప్రగతిశీల విధానాల వల్ల దేశంలోని పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయన్నారు. పోర్టులు, రైల్వే, రోడ్డు వ్యవస్థతో ఏపీ లాజిస్టిక్స్ కేంద్రంగా మారిందని అన్నారు. ఆగస్టు 1 తేదీ నుంచి ఏపీలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం ఏపీలో అందుబాటులోకి వస్తోందని వివరించారు. విస్తృతమైన వనరులతో వివిధ రంగాల్లో విస్తృత వ్యాపార అవకాశాలను అందించేందుకు ఏపీ సిద్దంగా ఉందని ముఖ్యమంత్రి యూఏఈ బృందానికి తెలిపారు. క్వాంటం స్పీడ్ తో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. పర్యావరణ అనుకూలంగా నిర్మిస్తున్న అమరావతిని మరో నివాసంగా మార్చుకోవాలని యూఏఈ ప్రతినిధులను సీఎం కోరారు.

### ఏపీ-యూఏఈ మధ్య ఫుడ్ కారిడార్

కృష్ణా-గోదావరి లాంటి నదులున్న ఆంధ్రప్రదేశ్ లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని యూఏఈ ఎకానమీ, టూరిజం విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విజనరీ నేత సీఎం చంద్రబాబు నాయుడు అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. భారత్- యూఏఈ వాణిజ్య బంధంలో భాగంగా ఏపీలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా పని చేస్తున్నామని తెలిపారు. ఏపీలోని రొయ్యలు, అరటి లాంటి ఉద్యాన ఉత్పత్తులు వాణిజ్యంలో కీలకంగా ఉన్నాయని అన్నారు. ఏపీలో ఫుడ్ పార్క్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్ సహా వివిధ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తూ వాణిజ్యాన్ని, పరిశ్రమల్ని ప్రోత్సహించటం సంతోషదాయకమని ఆయన ప్రశంసించారు. అమరావతి నుంచి న్యూయార్క్ మార్కెట్ వరకూ కు డెయిరీ, పౌల్ట్రీ, సీఫుడ్ , పప్పు దినుసులు తదితర రంగాల్లో ఎగుమతులపై దృష్టి పెడతామని అన్నారు. కృష్ణపట్నం, కాకినాడ నుంచి యూఏఈకి షిప్పింగ్ రూట్లోనూ వాణిజ్యం మరింత పెరిగేందుకు సహకరిస్తామని యూఏఈ మంత్రి తెలిపారు. ఏపీ-యూఏఈల మధ్య బంధం మరింత వేగంగా బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నట్టు అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ స్పష్టం చేశారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో యూఏఈకి ఫుడ్ క్లస్టర్ చైర్మన్ సలేహ్, యూఏఈ సహాయ కార్యదర్శి మారియా అల్ ఖాసిమ్, స్పెషల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ అనూషా అల్ మర్జూఖీ, యూఏఈ ఎంబసీ నుంచి అహ్మద్ అల్ జ్నేబీ, ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయి ప్రసాద్ , పరిశ్రమలు, ఈడీబీ, ఆర్థికశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## విద్యార్థుల ఆందోళనల వేళ..

(మొదటిపేజీ తరువాయి)

నీట్ పేపర్ లీక్ విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించిందని, నిందితుల అరెస్టులకు దారితీసిందని ప్రధాని చెప్పినట్లు రిజిజు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే తిరిగి పరీక్ష నిర్వహించామని మోదీ నొక్కిచెప్పారన్నారు. మరోవైపు ఈ ఉద్యమానికి మద్దతుగా 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులపై పోలీసుల దమనకాండను చూశాక, ఆసుపత్రి నుంచే తన దీక్షను కొనసాగిస్తానని ఆయన ప్రకటించారు. ఇదిలా ఉంటే.. తమను ప్రభుత్వం చర్చలకు పిలిచిందని, కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో తమ నేతలు సమావేశమై డిమాండ్లతో కూడిన లేఖను సమర్పించారని సీజేపీ తెలిపింది. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగిందని అంగీకరించిన నడ్డా, చర్చల ప్రతిపాదన నిరసనకారుల నుంచే వచ్చిందని స్పష్టం చేశారు.

## 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 36 ప్రధాన ప్రాజెక్టులను ఏ స్థాయిలో పూర్తి చేస్తామనే దానిపై స్పష్టమైన కార్యాచరణను వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు తాగు, సాగు నీటిని సరఫరా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

## మంగళగిరిని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయం



మంగళగిరి సింధూరదర్శిని: మంగళగిరి ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా, ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తా, అన్నిరంగాల్లో మంగళగిరి నెం.1గా నిలబడాలి. భారతదేశంలోనే మంగళగిరిని ఆదర్శ నియోజక వర్గంగా తయారు చేయాలన్నదే తన ధ్యేయమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు -- మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సికె కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటుచేసిన సభలో మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2024 ఎన్నికల తర్వాత మంగళగిరి ప్రజలే నా నమ్మకమయ్యారు. 2019 ఎన్నికల్లో నేను స్థానిక ప్రజలను అర్థం చేసుకునేలోపు ఎన్నికలు అయిపోయాయి, ఫలితంగా 5,300 ఓట్లతో ఓడిపోయాను. రెండురోజులు బాధపడినా మీ మనసు గెలవాలని ఆనాటి నుంచి నా ప్రయాణం ప్రారంభించా. ఐదేళ్లలో ఎప్పుడు ఎవరిని కలిసినా మా భూమికి శాశ్వత హక్కు కావాలని అడుగుతూ వచ్చారు. ఒకేసారి అందరి భూములను రెగ్యులరైజ్ చేయలేను, అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని చెప్పాను. ఈరోజు 3వేలమందికి శాశ్వత పట్టాలు అందజేస్తున్నాం. దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు ఎవరు వచ్చి తమ ఇళ్లు, స్థలాలు లాగేసుకుంటారోనని భయంతో బతికారు, ఈరోజుతో ఆ భయం పోతుంది, భూమిపై శాశ్వత హక్కును కూటమి ప్రభుత్వం కల్పిస్తుంది. సుమారు వెయ్యికోట్ల విలువైన భూమిని ఈరోజు అందిస్తున్నాం. మీ భూమిని ఇకపై కుటుంబ అవసరాలకు బ్యాంకులో పెట్టి లోన్ తీసుకోవచ్చు. ఎవరు వచ్చినా మీ భూమిని తీసుకోలేరు.

### మీరిచ్చిన బలమే ముందుకు నడిపిస్తోంది

2019 ఎన్నికల తర్వాత అనేక అవమానాలు ఎదుర్కొన్నాను. కొడుకును గెలిపించుకోలేకపోయావని కొందరు మా నాన్నను అవమానించారు. ఎన్నికలకు ముందు నేను గతంలో ఓటమిపాలైన 5300 పక్కన ఒక్క సున్నా పెట్టి గెలిపించమని చెప్పా.

## రాహుల్ గాంధీ మాట మార్చారు

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. నీట్ పరీక్షలో అవకతవకలు, విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలోని ప్రధాని నివాసం సమీపంలో ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో ధర్నా ప్రారంభమైన గంట తర్వాత మంత్రి జితేంద్ర సింగ్ అక్కడికి చేరుకుని రాహుల్‌తో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాకు వివరణ ఇచ్చారు. నీట్ అంశంపై చర్చ జరపాలన్న కాంగ్రెస్ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించిందని, కానీ ఆ తర్వాత రాహుల్ గాంధీ మరో కొత్త డిమాండ్‌ను తెరపైకి తేవడంతో చర్చలు విఫలమయ్యాయని జితేంద్ర సింగ్ వివరించారు. మరోవైపు, ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. నీట్ వివాదానికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. చర్చలు కొలిక్కి రాకపోవడంతో తమ నిరసన కొనసాగుతుందని ఆ పార్టీ నేతలు ప్రకటించారు.




# ఎస్సీ గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలి

**సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్, సీపీఐ పట్టణ కన్వీనర్ వై .సునీల్**

గూడూరు( సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా ;

కోట బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్, సీపీఐ పట్టణ కన్వీనర్ వై. సునీల్ లు పేర్కొన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, ఎంతో మంది ఉన్నతికి తోడ్పడిన కోట అంబేద్కర్ గురుకుల పాఠశాలను సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ పేరుతో గురుకుల పాఠశాలను మూసి వేయడం ఎంత వరకు సమంజసం అని పేర్కొన్నారు.

సుమారు 600మంది విద్యార్థులకు ఉన్న ఫలంగా బదిలీ సర్టిఫికెట్లు ఇచ్చి ఇతర పాఠశాలలకు వెళ్ళమని చెప్పడంతో భవిష్యత్ గందరగోళం అయిందన్నారు. సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌కు అవసరమైన కొత్త భవనాలు, ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలాలను కేటాయించే ఆలోచన చేయాలని కోరారు. తరలింపు నేపథ్యంలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, తల్లి దండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎన్నో రంగాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. ఎస్సీ నియోజకవర్గంలో ఎస్సీ గురుకుల పాఠశాలను ఎత్తివేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి జమాలుల్లా, ఏ .ఐ. యు.సి జిల్లా అధ్యక్షులు కె.నారాయణ, ఏ. ఐ.టి. యు.సి నియోజవర్గ అధ్యక్షులు సి. విఆర్ కుమార్, సీపీఐచిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏ. ఐ. వై.ఎఫ్ నాయకులు సి.వి.ఎల్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ యూనిట్

**రొటేరియన్ రామకృష్ణ స్వరూప్ సహకారంతో**
**వాటర్ ప్యూరిఫైయర్ యూనిట్ ఏర్పాటు**
**రోటరీ క్లబ్ అధ్యక్షులు తిరుమూరు సురేష్ రెడ్డి**



గూడూరు( సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండలంలోని పారిచర్లవారిపాళెం గ్రామంలో ఏర్పాటై ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ అద్వర్యంలో వాసిలి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు రొటేరియన్ రామక్రిష్ణ స్వరూప్ సహకారంతో వాటర్ ప్యూరిఫైయర్ యూనిట్ అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అద్యక్షుడు తిరుమూరు సురేష్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ ఈ పాఠశాలకు గతంలో బెంచీలు, పుస్తకాలు వంటి వాటిని పంపిణీ చేసి ఉన్నామని గుర్తు చేశారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు వాటర్ పూరిఫైయర్ యూనిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు మునిగిరీష్, దశరథరామి రెడ్డి, నాగ సునీల్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, వెంకట సురేష్‌బాబు, బాలక్రిష్ణం రాజు, హరిప్రసాద్, ఎస్వీ నాగేంద్ర ప్రసాద్, రఘురామిరెడ్డి, రాంప్రసాద్, ప్రసాద్ నాయుడు. బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులకు టిడ్కో గృహ సముదాయాలు కేటాయింపు: కమిషనర్ వై ఓ నందన్



నెల్లూరు ( సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని గుప్తా పార్కు సమీపంలో యనమల వారి వీధి ప్రాంతంలో ఇటీవల కూలిపోయిన గృహాలకు సంబంధించిన తొమ్మిది మంది నిర్వాసితులకు స్థానిక బి.ఈ.డి కళాశాలలో ఆశ్రయం కల్పించారు. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ పి.నారాయణ ఆదేశాల మేరకు కమిషనర్ వై.ఓ నందన్ నిర్వాసితులకు మంగళవారం భగత్ సింగ్ కాలనీ టిడ్కో గృహ సముదాయాల ప్రాంగణంలో గృహాలను కేటాయిస్తూ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓడీఓపీ కింద నెల్లూరు ఉత్పత్తులకు ప్రాధాన్యం


**పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద సమాధానం**
**ఉదయగిరి చెక్క వస్తువులు, పాటూరు చీరలకు ప్రత్యేక గుర్తింపు**
**గ్లోబల్ మార్కెటింగ్, ఎగుమతుల ప్రోత్సాహకంపై కేంద్రం స్పష్టత**



నెల్లూరు (సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా; దేశంలో ప్రతి జిల్లా కేంద్రంగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' పథకం కింద పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు సంబంధించిన వివరాలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంటులో పలు ప్రశ్నలు లేవనెత్తారు. నెల్లూరు జిల్లా నుంచి ఉత్పత్తుల ఎంపిక, వాటి ఉత్పత్తి, విక్రయాలు, ఉపాధి కల్పన, ఎగుమతులకు కేంద్రం అందిస్తున్న సహాయంపై ఎంపీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయమంత్రి జితిన్ ప్రసాద మంగళవారం పార్లమెంటులో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఎంపీ అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ... ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల నుంచి మొత్తం 99 ఉత్పత్తులను (26 ప్రాథమిక, 26 ద్వితీయ, 21 తృతీయ, 26 కేటగిరీ ఉత్పత్తులు) ఓడీఓపీ కింద గుర్తించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. నెల్లూరు జిల్లా నుంచి ప్రాథమిక ఉత్పత్తిగా ఉదయగిరి చెక్క భోజన సామగ్రి (ఉదయగిరి స్పూన్లు/చెక్క వస్తువులు)ని, ద్వితీయ ఉత్పత్తిగా పాటూరు కాటన్ సిల్క్ చీరలను ఓడీఓపీ పథకం కింద గుర్తించినట్లు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఓడీఓపీ కింద గుర్తించిన ఉత్పత్తుల ప్రచారం, విక్రయాల కోసం ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. దేశీయంగా, అంతర్జాతీయంగా నిర్వహిస్తున్న ప్రదర్శనల్లో ఈ ఉత్పత్తుల ప్రదర్శనకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం, పాయకరావుపేట పట్టు చీరల తయారీలో సుమారు 100 మంది చేనేత కార్మికులు నిమగ్నమై ఉన్నారని, ఓడీఓపీ కింద గుర్తించిన తర్వాత రూ.10.08 కోట్ల విలువైన ఉత్పత్తి నమోదైనట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఓడీఓపీ ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వ ఇ-మార్కెట్‌ప్లేస్ పోర్టల్‌లో బజార్'ను ఏర్పాటు చేసి, ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించినట్లు వివరించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, విదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాల ద్వారా అంతర్జాతీయ కొనుగోలుదారులు-అమ్మకందారుల సమావేశాలు నిర్వహిస్తున్నామని, భారతదేశంలో జరిగే అంతర్జాతీయ, బహుళపక్ష సమావేశాల్లో ఓడీఓపీ ఉత్పత్తులను ప్రత్యేక బహుమతులుగా అందిస్తూ అంతర్జాతీయంగా గుర్తింపు తెస్తున్నట్లు చెప్పారు. అలాగే జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద జాతీయ, రాష్ట్ర స్థాయి ఎక్స్‌పోలు నిర్వహిస్తూ చేనేత రంగానికి మార్కెటింగ్ మద్దతు ఇస్తున్నామని, హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ సహకారంతో ఎగుమతికి తగిన ఉత్పత్తులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఎగుమతుల ప్రోత్సాహంలో భాగంగా, మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ సమాచారం ప్రకారం.. 2024 ఆర్థిక సంవత్సరంలో దేశం మొత్తం రూ.71,070 కోట్ల (7.38 బిలియన్ అమెరికన్ డాలర్లు) విలువైన సీఫుడ్ ఎగుమతుల్లో, విశాఖపట్నం పోర్టు నుంచే రూ.21,090 కోట్ల (2.19 బిలియన్ అమెరికన్ డాలర్లు) విలువైన ఎగుమతులు జరిగాయని కేంద్ర మంత్రి వివరించారు. యాంటీబయాటిక్ రహిత నాణ్యమైన ఆక్వాకల్చర్ ఉత్పత్తులకు ఎంపెడా షాఫారీ సర్టిఫికేషన్‌ను అర్హులైన హేచరీలు, ఫీడ్ యూనిట్లకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సంప్రదాయ మత్స్యకారులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద పడవలు, వలలు అందించడం, సముద్రపాచి సాగు యూనిట్ల ద్వారా స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించడం వంటి చర్యలు కూడా చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఓడీఓపీ పథకం కింద మరిన్ని ఉత్పత్తులను చేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రస్తుతం ఎలాంటి కొత్త ప్రతిపాదనలు అందలేదని కేంద్ర మంత్రి వెల్లడించారు.

# నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించడమే కూటమి లక్ష్యం

**ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**



గూడూరు( సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా; నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న యాజమాన్యాలకి స్థానికులకే ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని తెలియజేస్తున్నామని రాబోయే రోజుల్లో గూడూరు నియోజకవర్గం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని డి ఆర్ డబ్ల్యు మహిళా కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హాజరయ్యారు. ఎంపికైన వారికి అపాయింట్మెంట్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ కంపెనీలు ఏర్పాటు చేసే వారికి స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని తెలియజేస్తున్నామని నియోజకవర్గంలో క్రిస్ సిటీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అలాగే భారీ ఫర్నిచర్ పరిశ్రమ త్వరలో ప్రారంభం కానుంది అని ఇంకా అనేక పరిశ్రమలు వస్తాయని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని అనేకమంది డీఎస్సీ చదివిన వారికి టీచర్ పోస్టులు ఇవ్వడం జరిగిందని వీటిని రద్దు చేయాలని ప్రతిపక్ష వైసిపి పార్టీ కోర్టుకు వెళ్లిందని గుర్తు చేశారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎంతోమందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ది అని గత వైసిపి ప్రభుత్వం లో స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబునాయుడు ని అరెస్టు చేశారని దీనిపై ఉద్యోగాలు పొందిన వారందరూ నిరసన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, రహీం, వెంకటేశ్వరరాజు, హరి కుమార్, రవీందర్ రెడ్డి ,వైయస్సార్, ముమ్మడి వెంకటేశ్వర్లు ,హనుమంతరావు ,స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిత్య అన్నదానానికి విరాళంగా సామాగ్రి వితరణ



బుచ్చిరెడ్డిపాలెం(సింధూరదర్శిని) 21 జులై నెల్లూరు జిల్లా; బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడ క్షేత్రం శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానము నందు నిత్య అన్నప్రసాద వితరణకు స్టెయిన్‌లెస్ స్టీల్ ట్రాలీ, ఇనుప గ్యాస్ స్టవ్ విరాళం గా నెల్లూరు జిల్లా రేగడిచెలిక వాస్తవ్యులు పూడి ప్రసాద్ , వారి ధర్మపత్ని రుమ్కి దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్య అన్నదాన సేవకు ఉపయోగపడే విధంగా రూ.27,000 విలువైన స్టెయిన్‌లెస్ స్టీల్ అన్నప్రసాద పంపిణీ ట్రాలీ మరియు రూ.9,000/- విలువైన ఇనుప గ్యాస్ స్టవ్ (గ్యాస్ బర్నర్ స్టాండ్) ను భక్తిశ్రద్ధలతో విరాళంగా అందజేశారు. మొత్తం రూ.36,000 విలువైన ఈ సామగ్రి నిత్య అన్నదాన కార్యక్రమానికి సమర్పించారు. ఆలయంలో ప్రతిరోజూ నిర్వహించే నిత్య అన్నదాన కార్యక్రమంలో భోజనం తయారీ, ప్రసాదం మరియు అన్నదాన పంపిణీ మరింత పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా, వేగవంతంగా నిర్వహించేందుకు ఈ సామగ్రి ఎంతో ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి దాతృత్వాన్ని, సేవాభావాన్ని అభినందించారు. భక్తులు అందించే ఇలాంటి విరాళాలు ఆలయ సేవా కార్యక్రమాల అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# రహదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డా, ఎస్.వెంకటేశ్వర్




తిరుపతి (సింధూర దర్శిని) 21 జూలై తిరుపతి జిల్లా ; రైల్వే ప్రాజెక్ట్,భూసేకరణ, జాతీయ రహదారులు పనులు శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, కృష్ణపట్నం పోర్ట్, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి, రాయల్ ఎంఫిల్డ్ కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీక్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావుతో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు,జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్‌లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2,స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు నేషనల్ హైవే ఏపిడిలు, వెంకటేశ్వర్లు, రమేష్, రైల్వే ప్రాజెక్టు అధికారి, సదరన్ రైల్వే అధికారి వామన మూర్తి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్. శివకుమార్, టిటిడి వెల్ఫేర్ అధికారి, ఎస్ఈ ఇరిగేషన్, ఆర్అండ్ బి ఎస్ఈ, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖఅధికారి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు, తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... శ్రీ సిటీ ఫేజ్ -2, ఏ పి ఐ ఐ సి లోని ఎల్ జి ఫేజ్ -1,2,3 శ్రీ సిటీ ఫేజ్ -1, 2,3,4, నాయుడుపేట ఫేస్-2, వానెల్లూరు, పాగలి, రాయల్ ఎంఫిల్డ్ ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, విసిఐసి రోడ్డు, ఏపిఐఐసి ప్రాజెక్ట్స్,వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి - శ్రీకాళహస్తి, ఏర్పేడు - పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, పాకాల - తిరుపతి, తిరుపతి - కాట్పడి అర్కోణం - రేణిగుంట, సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను, దుగ్గరాజపట్నం, వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, నాయుడుపేట-రేణిగుంట, రేణిగుంట- కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యతతో పనులు పూర్తి కావాలని అన్నారు. ఎయిర్పోర్ట్, ఇస్రేర్, కరకంబాడి, ఎమ్ ఐ జి లే అవుట్ తిమ్మాజికండ్రిగ, పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల శాఖ అధికారులు అందరూ కలసి సమన్వయంతో పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, బానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారి రాంప్రసాద్, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్, నేషనల్ హైవే చెన్నై పిడి రవీంద్రరావు, సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ అధికారులు భాస్కర్, చైతన్య, భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# ఉప ముఖ్యమంత్రి సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలి

### స్వామి అమ్మవార్లకు జనసేన నాయకులు ప్రత్యేక పూజలు



బుచ్చిరెడ్డిపాలెం (సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా; బుచ్చిరెడ్డిపాలెం జొన్నవాడ క్షేత్రం నందు శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానము నందు మంగళవారం ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని జొన్నవాడకు పాదయాత్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కుడి భుజానికి జరిగిన శస్త్ర చికిత్స అనంతరం ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మంగళవారం సాయంత్రం నెల్లూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు బుచ్చిరెడ్డిపాలెం నుండి శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ వరకు భక్తిశ్రద్ధలతో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రగా జొన్నవాడ దేవస్థానానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలకు దేవస్థాన కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ మల్లికార్జున స్వామివారిని, శ్రీ కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా కొనసాగాలని స్వామివారిని, అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గాదిరాజు జీవన్ కృష్ణ , నక్కల శివకృష్ణ , చిరమన సురేష్ గునుకుల కిషోర్ , నూనె మల్లికార్జున యాదవ్ పప్పు నారాయణ తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం తరపున తీర్థప్రసాదాలు అందజేయబడినవి.

# రాష్ట్ర స్థాయి ఉత్తమ పనితీరు అవార్డు మన బాధ్యతను పెంచింది: కమిషనర్




నెల్లూరు (సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా ; స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్ -- 30 డేస్ ప్రోగ్రామ్" లో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ "బెస్ట్ పెర్ఫార్మింగ్ " గా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొంది, పారిశుధ్య నిర్వహణలో మనందరి బాధ్యతను మరింతగా పెంచిందని కమిషనర్ వై.ఓ నందన్ హర్షం వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ నగరపాలక సంస్థ అవార్డును అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 3 లక్షలకు పైగా జనాభా కలిగిన పట్టణ స్థానిక సంస్థల విభాగంలో లభించిన ఈ ప్రతిష్టాత్మక అవార్డును గుడివాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నెల్లూరు నగర పాలక సంస్థకు అందజేసి ప్రోత్సహించారని తెలిపారు. ఈ పురస్కారం నగర పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు, అధికారులు, పారిశుధ్య కార్మికులు మరియు ప్రజల సమిష్టి కృషికి లభించిన గుర్తింపుగా నిలిచిందని కమిషనర్ ప్రతి ఒక్కరిని అభినందించారు.ఈ విజయానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ పరిపాలన శాఖ, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుధ్య సిబ్బంది మరియు నగర ప్రజలందరికీ నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోందని కమిషనర్ ప్రకటించారు.

**"మన నగరం -మన బాధ్యత -మన గర్వం"**

అనే భావనతో ప్రతి పౌరుడు పరిశుభ్రమైన, హరితమైన నెల్లూరు నిర్మాణానికి ఇదే ఉత్సాహంతో సహకరించాలని ఆకాంక్షించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణలో మరింత మెరుగైన ప్రగతిని కనబరిచేందుకు, ఇలాంటి ప్రోత్సాహకాలను అందుకునేందుకు సంసిద్ధంగా ఉంటామని కమిషనర్ తెలియజేశారు. భవన నిర్మాణ సామాగ్రి తరలింపు సమయంలో రోడ్లపై ఇసుకను వెదజల్లుకుంటూ వెళ్లే చర్యలను పూర్తిస్థాయిలో నిరోధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, వాహనాల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. అదేవిధంగా వ్యర్థాలను రోడ్ల పక్కన డంపింగ్ చేసే వారిని గుర్తించి, పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకోవడంలో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహసీన్ అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధుల సహకారం ఎనలేనిదని కమిషనర్ కొనియాడారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ. దినేష్, మలేరియా విభాగం డాక్టర్ జిజియ, టి.పి.ఆర్.ఓ, శానిటేషన్ సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

# శిశు మరణాలు జరగకుండా చూడాలి

### జిల్లాస్థాయి శిశు మరణాల సమీక్ష సమావేశము



తిరుపతి(సింధూరదర్శిని)21జూలై తిరుపతిజిల్లా; జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శిశు మరణాల సమీక్ష సమావేశము జరిగింది. ఆ మీటింగులో జిల్లావ్యాప్తంగా జూన్ నెలలో జరిగిన ఆరు శిశు మర ణాలపై సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి మాతాశిశు మరణములు జరిగిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులనుండి మరియు చికిత్స అందించిన ఆసుపత్రుల డాక్టర్ల నుండి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, అంగన్వాడీ కార్యకర్తలు వారికి అందించిన సేవలను గురించి సమీక్షించారు. డిఎంహెచ్వో మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది గర్భవతులు,బాలింతలు, చిన్నపిల్లలను క్రమం తప్పకుండా సందర్శించి వారికి అన్ని రకాల ఆరోగ్య సేవలు, సూచనలు, సలహాలు సకాలంలో అందించాలని, బాల్యవివాహాలు జరగకుండా చూడాలని, బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడు సంవత్సరాల ఎడం పాటించేటట్లు దంపతులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆదేశించినారు. సదర్ మీటింగునకు డీసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్, రుయా హాస్పిటల్ మరియు ప్రైవేట్ ఆసుపత్రుల పీడియేట్రీషియన్లు, గైనకాలజిస్ట్ డాక్టర్లు, కమిటీ సభ్యులు,డి పి హెచ్ ఎన్ ఓ మంజుల, దామినేడు, భాకరాపేట, రైల్వేకోడూరు, బాలాయపల్లి, మధురానగర్, ఎంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సూపర్వైజర్లు,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు,ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారే సమర్పణ




బుచ్చిరెడ్డిపాలెం (సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా; బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని జొన్నవాడ క్షేత్రం శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం నందు సహాయక కమిషనర్ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ఆలయ చైర్మన్ అశోక్ రెడ్డి పర్యవేక్షణలో ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ముత్తైదువులు సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో సారెసమర్పణ నిర్వహించారు.ఈ సందర్భంగా ముత్తైదువులు పసుపు, కుంకుమ, చీర, కొబ్బరికాయ, పండ్లు, పూలు,తాంబూలం తదితర మంగళద్రవ్యాలతో అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మ వారికి పూజలు చేసి హారతి అందజేశారు.అమ్మవారిని దర్శించుకున్న మహిళలు తమ కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సౌభాగ్యం, సంతాన సౌఖ్యం కలగాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు, అక్షింతలు అందించి ముత్తైదువులను ఆశీర్వదించారు. ఆషాఢ మాసంలో శ్రీ కామాక్షితాయి అమ్మవారికి సారె సమర్పించడం విశేష ఫలప్రదమని విశ్వసిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

# గంగమ్మకు కానుకగా ముక్కుపుడక

తిరుపతి (సింధూర దర్శిని) 21 జూలై తిరుపతి జిల్లా ; తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంనకు మంగళవారం చిన్న అంజిమేడుకు చెందిన శ్రీ కన్నాలె మోహన్ రెడ్డి సుమారు నాలుగు గ్రాముల రాళ్ళతో కూడిన బంగారు ముక్కుపుడకను అమ్మవారికి కానుకగా అందజేశారని , ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ మరియు కార్యనిర్వహణాధికారి ఎ. జయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.





# దక్షిణ కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయించడమే లక్ష్యం

- -ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
- -పొదలకూరు మండల అభివృద్ధి జరిగిందే మా హయాంలో
- -ఎన్టీఆర్ నాయకత్వంలో పనిచేసే అవకాశం లభించడం నా అదృష్టం
- -అమ్మవారిపాళెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉంది

పొదలకూరు (సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా ; పొదలకూరు మండలం అమ్మవారిపాళెంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మొదట ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మయ్య నాయుడుతో కలిసి నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ చేశారు. అనంతరం మోటారు సైకిల్ ర్యాలీతో సోమిరెడ్డికి ఘన స్వాగతం పలికిన అమ్మవారిపాళెం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్..ప్రజా సంక్షేమం విషయంలో దేశంలో ఎవరికీ రాని ఆలోచనలు ఆయనకు వచ్చాయి అని పింఛన్లు, పక్కా ఇల్లు, రూ.2కే కిలో బియ్యం, రైతులకు హార్స్ పవర్ విద్యుత్ రూ.50కి వంటి కీలక పథకాలకు శ్రీకారం చుట్టిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుంది. మండల వ్యవస్థను తేవడంతో పాటు సింగిల్ విండో సొసైటీలతో రైతుబాంధవుడిగా నిలిచారు .పెద్దాయన ఎన్టీఆర్ పుణ్యం, అప్పటి మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ప్రత్యేక చొరవతో మన జిల్లాకు 146 టీఎంసీల సామర్థ్యం కలిగిన సోమశిల, కండలేరు జలాశయాలు ఏర్పడ్డాయి.

ఎన్టీఆర్ నాయకత్వంలో సెంట్రల్ బ్యాంకు చైర్మన్ గా, టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా పనిచేసే అవకాశం నాకు లభించింది. తోడేరు రెడ్డి పర్సనాలిటీ చూసి పొదలకూరు మండల ప్రజలు ఆయనకు ఓట్లు గుద్దేస్తున్నారు...కానీ మొదటి నుంచి ఆయన చేసేవి దుర్మార్గాలే అత్త ఊరు వావిలేటిపాడులో దళితుల భూములు ఆక్రమించారు..ఆ పక్కనే విశ్రాంత ఉద్యోగుల స్థలాలను చెరపట్టేశాడు.

జెడ్పీ చైర్ పర్సన్ గా, రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పదవులు అనుభవించి పొదలకూరు మండలానికి చేసింది శూన్యం. చేసిందేమీ లేకపోగా, గతంలో మేం చేపట్టిన ప్రాజెక్టులపై కక్షకట్టి అర్ధంతరంగా ఆపేశాడు

ఈ ప్రాంత ప్రజల పాతికేళ్ల కల అయిన సోమశిల దక్షిణ కాలువను 2014-19 మధ్య సాకారం చేశాం...2019లో నేను ఓడిపోగానే ఆ కాలువ పనులను అడ్డుకున్నారు.

సోమశిల దక్షిణ కాలువ పెండింగ్ పనులను పూర్తి చేసి మిగిలిన గ్రామాలకు కూడా నీరు అందిస్తా గంటా రమణయ్య ఆశీస్సులతో కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయించే బాధ్యత నాది ఎవరు ఎంతకాలం బతుకుతామో తెలియదు.. బతికిన కొంత కాలమైనా ప్రజలకు సేవ చేసి మంచి అనిపించుకోవాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు , గ్రామస్థులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ఎస్‌బీఐ రుణ సహకారంతో నూతన ఆటోల పంపిణీ


రుణమేళా ద్వారా స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



నరసరావుపేట,(సింధూర దర్శిని)

ఈ నెల 17న నరసరావుపేటలో నిర్వహించిన భారీ క్రెడిట్ అవుట్‌రీచ్ (రుణ వితరణ) కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట క్రిస్టియన్‌పాలెంలోని ఐదుగురు లబ్ధిదారులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణ సహకారంతో నూతన సిఎన్జి ఆటోరిక్షాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్ల, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం రుణ సహకారంతో ఆటోలు పొందిన లబ్ధిదారులతో కలిసి క్రిస్టియన్ పాలెం నుంచి పల్నాడు బస్టాండ్ సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానికుల దృష్టిని ఆకర్షించింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ జూలై 17న నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో నిర్వహించిన క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం దేశంలోనే అతిపెద్ద రుణమేళాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ఆ కార్యక్రమంలో సుమారు 1.03 లక్షల మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. చిరు, చిన్న వ్యాపారులు, కౌలు రైతులు, వ్యవసాయదారులు, పండ్ల వ్యాపారులు, వీధి వ్యాపారులు, చిన్న కిరాణా దుకాణాల యజమానులు తదితరులు స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకులు భద్రత లేదా గ్యారంటీ లేకుండానే వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా ప్రజలు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితికి బదులుగా బ్యాంకులే ప్రజల వద్దకు చేరే విధంగా ఆర్థిక సేవలు విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. క్రిస్టియన్‌పాలెం లో మొత్తం 19 ఆటోలకు రుణాలు మంజూరు చేయగా తొలి విడతగా 5 ఆటోలను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆటో డ్రైవర్లను యజమానులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు.ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో ఎస్‌బీఐ ద్వారా రూ.686 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే సంస్థ సామాజిక బాధ్యత (జూ=) నిధుల కింద రూ.1 కోటి మంజూరు చేసి లింగముంట్లలోని ఒక పాఠశాలను దత్తత తీసుకున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, స్థానికులు పాల్గొన్నారు.






# వైసిపి ముఖ్య నాయకులను కలిసిన సమన్వయకర్త

గూడూరు (సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా ; గూడూరు నియోజకవర్గ వైసిపి నూతన సమన్వయకర్తగా బూదూరు గురవయ్య ను వైసిపి అధిష్టానం యద్దల నరేంద్ర రెడ్డి ఆశీస్సులతో నియమించింది. ఈ సందర్భంగా సమన్వయకర్త గురవయ్య మాట్లాడుతూ తనను సమన్వయకర్తగా నియమించడానికి ఆమోదం తెలిపిన ప్రముఖులు మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి , నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ అను అరుణమ్మ , రూరల్ నియోజకవర్గం సమన్వయకర్త ఆనం విజయ్ కుమార్ రెడ్డి, వైసిపి రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ను నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల బొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేసి వారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగిందని, మీ అందరి ఆశీస్సులు ఉండాలని కోరినట్లు తెలిపారు. వారితోపాటు కృష్ణయ్య అట్లల శ్రీనివాసులరెడ్డి, అశోక్, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.







# నియోజకవర్గ నాయకులను కలిసిన నూతన సమన్వయకర్త




గూడూరు (సింధూర దర్శిని) 21 జూలై నెల్లూరు జిల్లా ; గూడూరు నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులను నూతనంగా ఎంపికైన గూడూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బూదూరు గురవయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త గురవయ్య మాట్లాడుతూ తనకు సమన్వయకర్తగా అవకాశం కల్పించినందుకు సహాయ సహకారాలు అందించిన వైయస్సార్ సిపి ప్రముఖ నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులైన వేమారెడ్డి కుమార్ స్వామి రెడ్డి , వైసీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి , మెట్ట రాధారెడ్డి , డేగపూడి కృష్ణారెడ్డి , డేగ పూడి వేణు రెడ్డి లను వారి నివాసాలకు వెళ్లి శాలువా కప్పి పూల బొకే అందజేసి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసి, ఆశీర్వాదం తీసుకున్నారు. అంతేకాకుండా మీ పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. వారితోపాటు అట్లా శ్రీనివాసులరెడ్డి, కృష్ణయ్య , మహేంద్ర, ప్రభాకర్ రాజు , అశోక్ ,బల్లి వెంకటేశ్వర్లు , ఇంద్రాణి, ప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.





# నారా లోకేశ్ వచ్చిన తర్వాతే మాకు గుర్తింపు వచ్చింది...

**మంగళగిరిలో ఇంటి పట్టాల లబ్ధిదారుల హర్షం**
**మంగళగిరిలో శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి నారా లోకేశ్**
**ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారని లబ్ధిదారుల హర్షం**
**లోకేశ్ వచ్చిన తర్వాతే తమకు గుర్తింపు దక్కిందని స్థానికుల ఆనందం**
**దశాబ్దాల తమ నిరీక్షణకు తెరపడిందని లబ్ధిదారుల భావోద్వేగం**
**నియోజకవర్గ అభివృద్ధిపై లోకేశ్‌కు ప్రశంసలు**



మంగళగిరి, సింధూరదర్శిని: నియోజకవర్గంలో పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తామన్న హామీని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన 'మన ఇల్లు–మన లోకేశ్' కార్యక్రమంలో ఆయన వందలాది మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందంటూ లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. లోకేశ్ వచ్చిన తర్వాతే తమకు ఓ గుర్తింపు లభించిందని పలువురు భావోద్వేగంతో తెలిపారు.

గతంలో ఎన్నికల ప్రచార సమయంలోనూ, యువగళం పాదయాత్ర సందర్భంగానూ మంగళగిరిలో అర్హులైన పేదలందరికీ శాశ్వత గృహ హక్కు పట్టాలు అందిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ హామీని నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు పట్టాలతో పాటు నూతన వస్త్రాలు అందించి, భోజన సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు తమ అనుభవాలను, ఆనందాన్ని పంచుకున్నారు.

లబ్ధిదారులు ఏమన్నారంటే..

1.చల్లా భవాని (సలాం సెంటర్, తాడేపల్లి): గత 15 ఏళ్లుగా తాడేపల్లిలో ఉంటున్నాం. లోకేశ్ గారు ఇంటి పట్టాలు ఇస్తారని ఆశగా ఎదురుచూశాం. మొదట్లో కొంచెం అనుమానం ఉన్నా, మా ఆకాంక్షలను ఆయన నెరవేర్చారు. మాకు నూతన వస్త్రాలు బహూకరించి పట్టా అందించిన లోకేశ్ కి ధన్యవాదాలు.

2.తురకా శివగురవమ్మ (తాడేపల్లి): 20 ఏళ్లుగా ఇంటి పట్టా కోసం ఎదురుచూస్తున్నాం. పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తామని లోకేశ్ గారు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. చాలా సంతోషంగా ఉంది. మంగళగిరి నుంచి ఆయనే మళ్లీ మళ్లీ గెలవాలి.

3. షేక్ మోతి (ఉండవల్లి): మొదటి విడతలో పట్టా రాక బాధపడ్డాం. ఇప్పుడు రెండో విడతలో మంత్రి లోకేశ్ గారు మాకు పట్టా ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. లోకేశ్ గారు మంగళగిరిని, రాష్ట్రాన్ని బాగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ సారి నా ఓటు ఆయనకే.

4. ఎన్.హరినాథప్రసాదరావు, ప్రభావతి (పోలకంపాడు, తాడేపల్లి): గత పదేళ్లుగా పోలకంపాడులో ఉంటున్నాం. మాకు శాశ్వత పట్టా అందించి లోకేశ్ గారు ఎంతో మేలు చేశారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. మళ్లీ ఇదే ప్రభుత్వం రావాలి.

5. ఫాతిమున్నీసా (ప్రకాష్ నగర్ క్వారీ): ఈ రోజు మాకు, మా కుమార్తెకు లోకేశ్ గారు శాశ్వత ఇంటి పట్టా ఇచ్చారు. ఇప్పటివరకు మాకు గుర్తింపు లేదు. లోకేశ్ గారు వచ్చాకే గుర్తింపు వచ్చింది. మళ్లీ తండ్రీకొడుకులు చంద్రబాబు గారు, లోకేశ్ గారే రావాలి.

6. తన్నీరు వెంకటేశ్వరరావు, బసవమ్మ (తాడేపల్లి): 40 ఏళ్లుగా తాడేపల్లిలో ప్రభుత్వ భూమిలో ఉంటున్నాం. గతంలో మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. నీరు, కరెంట్ లేక ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు లోకేశ్ గారు శాశ్వత పట్టా అందించి అన్నీ సమకూర్చారు.

7. మునిపల్లి బుజ్జి, సీత (డ్రైవర్ కాలనీ, ప్రకాష్ నగర్): 15 ఏళ్లుగా ప్రకాష్ నగర్‌లో ఉంటున్నాం. లోకేశ్ గారు ఎన్నికల ముందు మాట ఇచ్చారు, నిలబెట్టుకున్నారు. ఇంటికి పెద్ద కొడుకులా ఆదర్శంగా నిలిచారు. మేం ఆయన వెంటే ఉంటాం.

8. బాయిన సాయి కుమారి (నులకపేట): గత 40 ఏళ్లుగా నులకపేటలో ఉంటున్నాం. ఇంటి పట్టా లేక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. లోకేశ్ గారు ఇచ్చిన మాట నిలబెట్టుకుని శాశ్వత ఇంటి పట్టా అందించారు. ఆయనకు మా ధన్యవాదాలు.

9. షేక్ గౌసియా (తాడేపల్లి): 20 ఏళ్లుగా తాడేపల్లిలో ఉంటున్నా, మాకు గుర్తింపు లేదు. ఎవరు వచ్చి ఇల్లు కూలగొడతారోననే భయంతో బతికాం. లోకేశ్ గారు వచ్చి మాకు గుర్తింపు ఇచ్చారు. సొంత ఇంట్లో ఉంటున్నామనే భావన ఇప్పుడే కలిగింది.

10. షేక్ ఆయేషా బేగం, షేక్ బాజి బాబు (పద్మశాలీ బజారు, తాడేపల్లి): 20 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. గతంలో చాలా మంది హామీ ఇచ్చినా ఎవరూ నెరవేర్చలేదు. లోకేశ్ గారు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. మంగళగిరి అభివృద్ధి చెందాలంటే ఆయనే మళ్లీ మళ్లీ రావాలి.

## పసిడి, వెండి ధరలకు రెక్కలు.. భారీగా పెరిగిన రేట్లు

**తులం బంగారం రూ.1,460 పెరిగి రూ.1.42 లక్షల పైకి**
**కిలో వెండి ధర రూ.3,380 పెరిగి రూ.2.21 లక్షలు దాటిన వైనం**
**సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారానికి పెరిగిన డిమాండ్**



ఇవాళ దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు తగ్గడం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి కారణాలతో సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడికి డిమాండ్ పెరిగింది. దీంతో ధరలు ఒక్కసారిగా పరుగులు పెట్టాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఇవాళ ఉదయం 11:20గంటల సమయంలో ఆగస్ట్ డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1,460 పెరిగి 10 గ్రాములకు రూ.1,42,848 వద్ద ఇంట్రాడే గరిష్ఠ స్థాయికి చేరుకుంది. అదేవిధంగా సెప్టెంబర్ డెలివరీ సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.3,380 పెరిగి కిలోకు రూ.2,21,780 గరిష్ఠాన్ని తాకింది. ట్రేడింగ్ ప్రారంభంలో 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,386, కిలోవెండి ధరరూ.2,19,200గా నమోదైంది.

**దిగివచ్చిన క్రూడాయిల్ ధరలు..**

అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల దిగువకు పడిపోవడం దేశీయ బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయనే నివేదికలు, ఇరాన్‌పై అమెరికా తన వైమానిక దాడులను నిలిపివేసిందని వచ్చిన వార్తలు ముడి చమురు ధరల తగ్గుదలకు కారణమయ్యాయి. గతంలో ముడి చమురు ధరలు పెరిగినప్పుడు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగి, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వంటి కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచుతాయనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే, మార్కెట్ నిపుణుల ప్రకారం ప్రస్తుతం కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి, బలమైన డాలర్ ఒత్తిడిని అధిగమించి సురక్షిత పెట్టుబడిగా బంగారానికి మద్దతునిస్తోంది. ఈ కారణంగానే పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గు చూపుతున్నారని వారు విశ్లేషిస్తున్నారు.

## బ్రాహ్మణులు బ్రహ్మయజ్ఞం పరీక్షలు విజయవంతం చేయండి

**రాష్ట్ర ఉపాధ్యక్షులు కౌశిక ప్రసాద్**

అమరావతి సింధూరదర్శిని: పురో హిత బ్రాహ్మణులు వచ్చే ఆగస్టు నెలలో మూడు, నాలుగు తేదీల్లో జరిగే బ్రహ్మయజ్ఞం పరీక్షలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు కౌశిక ప్రసాద్ పిలుపునిచ్చారు. మండల కేంద్ర మైన అమరావతిలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఆగస్టు మూడు, నాలుగు తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా విభాగం మండపేట మండ లం ద్వారపూడి గ్రామంలో రెండు రోజులపాటు పురోహిత బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మయజ్ఞం (స్మార్త పరీక్షలు) పరీక్షలను విజయవంతం చేయాలన్నారు.

## తిరుమల కాలిబాటలో అడవి పందికి యువతి పూజలు

**-వైరల్ వీడియోపై టీటీడీ అధికారుల హెచ్చరిక!**
**- వరాహమూర్తిగా భావించి నుదుటిపై బొట్టు పెట్టి నమస్కరించిన యువతి**
**-ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్**
**-భక్తుల చర్యపై తీవ్రంగా స్పందించిన అటవీ, టీటీడీ అధికారులు**
**-అడవి జంతువుల వద్దకు వెళ్లడం ప్రాణానికే ప్రమాదమని హెచ్చరిక**



తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తుల భక్తి విశ్వాసాలు అపారం. ఆ భక్తి కొన్నిసార్లు హద్దులు దాటి ప్రాణాల మీదకు తెస్తుంటుంది. తాజాగా తిరుమల నడకదారిలో ఓ యువతి చేసిన పని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వరాహ అవతారంగా భావించి ఓ అడవి పందికి ఆమె పూజలు చేయడం చర్చనీయాంశమైంది.

వివరాల్లోకి వెళితే.. తిరుమల శ్రీవారి దర్శనానికి మెట్ల మార్గంలో వెళుతున్న భక్తులకు ఓ అడవి పంది తారసపడింది. సాధారణంగా అడవి జంతువులను చూస్తే భయపడి దూరంగా పారిపోతారు. కానీ, ఓ యువతి మాత్రం ధైర్యంగా ఆ అడవి పంది వద్దకు వెళ్లింది. దాన్ని సాక్షాత్తు శ్రీమహావిష్ణువు వరాహ అవతారంగా భావించి, దాని నుదుటిపై కుంకుమ బొట్టు పెట్టి, నమస్కరించి పూజలు చేసింది. ఆ సమయంలో ఆ అడవి పంది కూడా ఎలాంటి హాని తలపెట్టకుండా నిశ్చలంగా ఉండిపోవడం ఆశ్చర్యం కలిగించింది. అక్కడున్న కొందరు ఈ దృశ్యాన్ని తమ ఫోన్లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది క్షణాల్లో వైరల్‌గా మారింది.

ఈ వీడియోపై నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు యువతి భక్తిని మెచ్చుకుంటుండగా, మరికొందరు ఇది ప్రాణాలతో చెలగాటమని, అత్యంత ప్రమాదకరమైన చర్య అని హెచ్చరిస్తున్నారు. అడవి పందులు అత్యంత క్రూరమైనవని, వాటి కోరలతో దాడి చేస్తే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉందని గుర్తుచేస్తున్నారు.

ఈ వైరల్ వీడియో అటవీ శాఖ, టీటీడీ అధికారుల దృష్టికి వెళ్లింది. వారు ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. భక్తులు ఇలాంటి సాహసాలు చేయవద్దని, ఇది భక్తి కాదని, ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవడమేనని తీవ్రంగా హెచ్చరించారు. శేషాచలం అడవులు క్రూరమృగాలకు నిలయమని, ముఖ్యంగా చిరుతపులులు, అడవి పందుల వంటి జంతువుల వద్దకు వెళ్లడం చాలా ప్రమాదకరమని స్పష్టం చేశారు. భక్తి ముఖ్యమే అయినప్పటికీ, వన్యప్రాణుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, వాటికి దూరంగా ఉండటమే శ్రేయస్కరమని అధికారులు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

## నకిలీ వజ్రంతో అసలుది మార్చే ప్లాన్..

**సింగపూర్‌లో ఇద్దరు భారతీయుల నిర్వాకం.. చివరికి!**
**సింగపూర్‌లో వజ్రం దొంగతనం కేసులో భారతీయుడికి జైలు**
**నకిలీ డైమండ్ ఇచ్చి అసలుది కొట్టేయాలని పక్కా ప్లాన్**
**ఒకరు సిబ్బందిని పక్కకు తిప్పగా, మరొకరు నోట్లో దాచిన వజ్రాన్ని మార్చిన వైనం**
**దేశం విడిచి పారిపోతుండగా ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్**
**ఈ శుక్రవారం జరగనున్న మరో నిందితుడి కేసు విచారణ**



సింగపూర్‌లోని ఓ జ్యువెలరీలో సుమారు 2 లక్షల సింగపూర్ డాలర్ల (దాదాపు రూ.1.48 కోట్లు) విలువైన వజ్రాన్ని దొంగిలించడానికి పక్కా ప్రణాళికతో వెళ్లిన ఇద్దరు భారతీయుల్లో ఒకరికి అక్కడి కోర్టు జైలు శిక్ష విధించింది. ఈ కేసులో నిందితుడైన మంగ్రోలియా మనోజ్‌కుమార్ కుర్జిభాయ్ (41) తన నేరాన్ని అంగీకరించడంతో అతనికి రెండు సంవత్సరాల రెండు నెలల రెండు వారాల జైలు శిక్ష విధిస్తూ ఈ నెల 17న తీర్పు వెలువడింది. మరో నిందితుడు సెరాసియా మిలన్ రామ్నిక్‌భాయ్ (30) కేసు విచారణ ఈ శుక్రవారం జరగనుంది. వివరాల్లోకి వెళితే.. వీరిద్దరూ ఈ వజ్రాన్ని ఎలా దొంగిలించాలో భారత్‌లోనే పథకం రచించారు. సూరత్‌లో ప్రత్యేకంగా ఆ వజ్రం స్పెసిఫికేషన్లు, సీరియల్ నంబర్‌తో సరిగ్గా సరిపోయేలా ఒక నకిలీ వజ్రాన్ని తయారు చేయించుకున్నారు. అనంతరం సోషల్ పాస్‌లపై జూన్ 19న సింగపూర్ చేరుకున్నారు. చైనాటౌన్‌లోని డియానోచే అనే జ్యువెలరీలోకి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ప్రవేశించి, 4.95 క్యారెట్ల వజ్రాన్ని చూడాలని కోరారు.

ప్లాన్ ప్రకారం మంగ్రోలియా మనోజ్‌కుమార్ దుకాణంలోని సేల్స్ మేనేజర్‌ను ఇతర ఆభరణాలు చూపిస్తూ మాటల్లో పెట్టాడు. అదే సమయంలో సెరాసియా మిలన్ తన నోట్లో దాచుకున్న నకిలీ వజ్రాన్ని బయటకు తీసి, అసలు వజ్రం స్థానంలో పెట్టి, నిజమైన వజ్రాన్ని నోట్లో దాచుకున్నాడు. అయితే, వారి చర్యలన్నీ సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. కొద్దిసేపటి తర్వాత కొనుగోలు విషయం ఆలోచించి చెబుతామని చెప్పి ఇద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన సేల్స్ మేనేజర్, ఆప్టికల్ జెమ్‌స్టోన్ ఐడెంటిఫికేషన్ మెషీన్‌తో వజ్రాన్ని పరీక్షించగా అది నకిలీదని తేలింది. మరోవైపు ఈ ఇద్దరూ తాము బస చేస్తున్న హోటల్ నుంచి ముందుగానే చెక్–అవుట్ చేసి, అదే రోజు రాత్రి భారత్‌కు విమానం బుక్ చేసుకున్నారు. అయితే, వారు దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా, చాంగీ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3 వద్ద ఇమ్మిగ్రేషన్ క్లియర్ చేస్తుండగా రాత్రి 8:50 గంటలకు పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. అసలు వజ్రాన్ని మిలన్ హ్యావర్‌సాక్‌లో స్వాధీనం చేసుకున్నారు. విచారణ సందర్భంగా కేవలం ఈ నేరం కోసమే వారు సింగపూర్ వచ్చినందున, ఇది ప్రణాళికాబద్ధమైన నేరమని ప్రాసిక్యూషన్ వాదించింది. అయితే, తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, తక్కువ శిక్ష విధించాలని మంగ్రోలియా కోర్టును అభ్యర్థించాడు. వాదనలు విన్న న్యాయస్థానం, అతనికి జైలు శిక్ష ఖరారు చేసింది.

# డైనోసార్లను తుడిచిపెట్టేసిన గ్రహశకలం అత్యంత అరుదైనది.. రహస్యం ఛేదించిన శాస్త్రవేత్తలు!

**6.6 కోట్ల సంవత్సరాల క్రితం భూమిడి ఢీకొన్న CO కాండ్రైట్ రకానికి చెందిన గ్రహశకలం**

**మెక్సికోలోని యుకాటన్ తీరాన్ని ఢీకొన్న గ్రహశకలం -భూమిపై ఉన్న 75 శాతం జీవజాతులు నాశనం**



సుమారు 6.6 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై నుంచి డైనోసార్ల జాతిని పూర్తిగా అంతరించిపోయేలా చేసిన గ్రహశకలం గురించిన ఒక అద్భుతమైన నిజాన్ని శాస్త్రవేత్తలు వెలికితీశారు. సౌర వ్యవస్థలోనే అత్యంత పురాతనమైన, అరుదైన 'జూ కాండ్రైట్' (జూ జష్ట్రశీఅనతీఈవ) రకానికి చెందిన అంతరిక్ష శిల వల్ల ఈ ప్రళయం సంభవించిందని అంతర్జాతీయ పరిశోధకుల బృందం గుర్తించింది. యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా (ఖదీజ), పారిస్, బ్రస్సెల్స్, వియన్నా పరిశోధకులు నిర్వహించిన ఈ అధ్యయన వివరాలు 'సైన్స్ అడ్వాన్సెస్' పత్రికలో ప్రచురితమయ్యాయి. ఆనాటి వినాశనం తర్వాత ఏర్పడిన పలుచని మట్టి పొరలో పదిలంగా ఉన్న నికెల్ ఐసోటోప్‌లను విశ్లేషించి శాస్త్రవేత్తలు ఈ ముగింపునకు వచ్చారు. 6.6 కోట్ల ఏళ్ల క్రితం మెక్సికోలోని యుకాటన్ తీరాన్ని సుమారు 10 కిలోమీటర్ల వెడల్పున్న గ్రహశకలం ఢీకొట్టి, భారీ 'చిక్సులబ్' బిలాన్ని ఏర్పరచడంతో పాటు భూగ్రహంపై ఉన్న 75 శాతం జీవజాతులను నాశనం చేసింది. ఈ తీవ్ర ఘాతానికి విపరీతమైన భూకంపాలు, రాకాసి సునామీలు, కార్చిచ్చులు చెలరేగగా.. వాతావరణంలోకి దట్టంగా అలముకున్న ధూళి, వాయువులు సూర్యకాంతిని కొన్నేళ్ల పాటు అడ్డుకుని భూ వాతావరణాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి.

తాజా పరిశోధన ప్రకారం, భూమిపై లభించే గ్రహశకలాల అవశేషాల్లో ఈ 'జూ కాండ్రైట్' రకం కేవలం 5 శాతం మాత్రమే ఉంటుంది. ఇవి గురు గ్రహం సమీపంలోని బయటి ఆస్టరాయిడ్ బెల్ట్ నుంచి లేదా సౌర వ్యవస్థ చివరి సరిహద్దుల నుంచి వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు. సాధారణంగా భావించేలా గ్రహశకలంలో ఉన్న గంధకం (సల్ఫర్) కంటే కూడా, దాని దాడి వల్ల ఆకాశంలోకి ఎగసిపడిన అతి సూక్ష్మ ధూళి కణాలే సూర్యకాంతిని పూర్తిగా కప్పివేసి వినాశనానికి ప్రధాన కారణమయ్యాయని పరిశోధకులు స్పష్టం చేశారు. విశ్వంలోనే అత్యంత అరుదైన ఒక గ్రహశకలం భూమిని ఢీకొట్టడం అప్పట్లో డైనోసార్ల దురదృష్టానికి నిదర్శనమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# ఇరాన్ అణు రహస్యం.. పర్వతం కిందకి వేల సెంట్రిఫ్యూజ్‌లు!

**పికాక్స్ పర్వతం కిందకి వేల సెంట్రిఫ్యూజ్‌లను తరలించిన ఇరాన్**

**ఇజ్రాయెల్, అమెరికా దాడుల నుంచి రక్షణ కోసమే ఈ చర్య**

**గత ఏడాది దాడుల తర్వాత రహస్యంగా తరలింపు జరిగిందని ఇజ్రాయెల్ నిఘా వర్గాల వెల్లడి**



ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని మరింత రహస్యంగా కొనసాగిస్తోందని, వేల సంఖ్యలో యురేనియం శుద్ధి చేసే సెంట్రిఫ్యూజ్‌లను అత్యంత సురక్షితమైన భూగర్భ కేంద్రానికి తరలించిందని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు వెల్లడించాయి. నతాంజ్ అణు కేంద్రానికి దక్షిణంగా ఉన్న పికాక్స్ పర్వతం ప్రాంతంలో భూమి లోపల ఇరాన్ కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అమెరికాకు ఇజ్రాయెల్ సమాచారం అందించింది. గత ఏడాది జూన్‌లో ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య 12 రోజుల పాటు చోటుచేసుకున్న ఉద్రిక్తతల అనంతరం ఈ తరలింపు ప్రక్రియ జరిగినట్లు తెలుస్తోంది. ఆ దాడుల్లో నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్ అణు కేంద్రాలు దెబ్బతినడంతో, కీలక పరికరాలను కాపాడుకునేందుకు ఇరాన్ ఈ చర్యలు చేపట్టింది. ఈ అణు కేంద్రాల్లో యురేనియాన్ని యురేనియం హెక్సాఫ్లోరైడ్‌గా మార్చి, సెంట్రిఫ్యూజ్‌ల ద్వారా ఇరాన్ శుద్ధి చేసింది. అయితే అది ఇప్పటికీ వాయు రూపంలోనే ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అణుబాంబు తయారీకి ఈ వాయువును లోహంగా మార్చాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఇరాన్ వద్ద ప్రస్తుతం ఉన్నాయా అనే దానిపై స్పష్టత లేదు.

# వచ్చే నెల నుంచి పెరగనున్న మారుతి కార్ల ధరలు

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా తమ వాహనాల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. 2026 ఆగస్టు నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని, ప్యాసింజర్ వాహనాల ధరలు గరిష్ఠంగా రూ. 30,000 వరకు పెరగనున్నాయని మంగళవారం వెల్లడించింది.

ముడిసరుకుల వ్యయం స్థిరంగా పెరుగుతుండటం, అధిక ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ తెలిపింది. ఈ మేరకు బీఎస్ఈ (బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్)కి సమర్పించిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో మారుతి సుజుకి ఈ వివరాలను పొందుపరిచింది. పెరిగిన ఖర్చుల భారాన్ని తగ్గించుకోవడానికి అంతర్గతంగా అనేక చర్యలు చేపట్టినా, తప్పనిసరి పరిస్థితుల్లో కొంత భారాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్లు వివరించింది. "గత కొన్ని నెలలుగా వ్యయ నియంత్రణ చర్యల ద్వారా ఖర్చుల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నించాం. అయినప్పటికీ, ద్రవ్యోల్బణ భారం అధిక స్థాయిలో ఉండటం, ప్రతికూల వ్యయ వాతావరణం కొనసాగుతుండటంతో, పెరిగిన వ్యయంలో కొంత భాగాన్ని మార్కెట్‌కు బదిలీ చేయక తప్పడం లేదు. అదే సమయంలో, వినియోగదారులపై దీని ప్రభావం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూస్తాం" అని మారుతి సుజుకి తమ ఫైలింగ్‌లో పేర్కొంది. అయితే, ఈ ధరల పెంపు అన్ని మోడళ్లపై ఒకేలా ఉండదని కంపెనీ స్పష్టం చేసింది. వాహనం మోడల్‌ను బట్టి పెంపు పరిమాణం మారుతుందని తెలిపింది. ఏ మోడల్‌పై ఎంత ధర పెరుగుతుందనే కచ్చితమైన వివరాలను మాత్రం కంపెనీ ఇంకా వెల్లడించలేదు.

# రోహిత్ మాటలు అప్పట్లో నమ్మలేదు.. ప్రపంచకప్‌లో అదే నన్ను మార్చింది: సంజూ శాంసన్

**టీ20 ప్రపంచకప్ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న సంజూ- ఆరంభ మ్యాచుల్లో ఎంపిక చేయకపోవడంతో నిరాశకు గురైనట్లు వెల్లడి**

**రోహిత్ ధైర్యం చెప్పినా నమ్మలేకపోయానన్న శాంసన్ - క్రికెట్ ఎందుకు ఆడుతున్నానో తనను తాను ప్రశ్నించుకున్నట్లు వెల్లడి**

**అదే తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్న సంజూ - న్యూజిలాండ్ సిరీస్ పెద్ద గుణపాఠం నేర్పిందని వెల్లడి**



టీ20 ప్రపంచకప్–2026లో తొలుత తుది జట్టులో చోటు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యానని భారత వికెట్‌కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ వెల్లడించాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విఫలమైన తర్వాత ఇషాన్ కిషన్ అద్భుతంగా రాణించడంతో తన ప్రపంచకప్ అవకాశాలు ముగిసిపోయాయని భావించినట్లు చెప్పాడు. ఆ సమయంలో రోహిత్ శర్మ ధైర్యం చెప్పినా తాను ఆ మాటలను నమ్మలేకపోయానని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు.

ప్రపంచకప్ ప్రారంభమైన తొలి నాలుగు, ఐదు రోజులు ఆ నిరాశ నుంచి బయటపడలేకపోయానని సంజూ చెప్పాడు. ఆ తర్వాత తన ఆలోచనా విధానాన్ని మార్చుకుని.. అసలు తాను క్రికెట్ ఎందుకు ఆడుతున్నానో తనను తాను ప్రశ్నించుకున్నానని వివరించాడు. అదే తనలో మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, మానసికంగా బలంగా మారేందుకు దోహదపడిందని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు ముందు మరింత మెరుగ్గా సిద్ధమయ్యానని సంజూ తెలిపాడు. ఆ మ్యాచ్‌లో ప్రతి షాట్ సహజంగానే వచ్చిందని, అది తన కెరీర్‌లో ప్రత్యేకమైన ఇన్నింగ్స్‌గా నిలిచిపోతుందని అన్నాడు. వికెట్లు పడుతుండటంతో సాధారణ ఆటతీరును మార్చుకుని పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేశానని వివరించాడు.

ఇక న్యూజిలాండ్ సిరీస్ తనకు పెద్ద గుణపాఠం నేర్పిందని సంజూ చెప్పాడు. ఎక్కువసేపు ప్రాక్టీస్ చేయడం కంటే మానసికంగా ప్రశాంతంగా ఉండటమే ముఖ్యమని తన భార్య చెప్పిన మాటలు అప్పుడే అర్థమయ్యాయని పేర్కొన్నాడు. తాను సాధించిన విజయాల్లో దేవుడి ఆశీర్వాదమే ఎక్కువని, ఆ ప్రపంచకప్ ఇన్నింగ్స్ జీవితాంతం గుర్తుండిపోతుందని సంజూ భావోద్వేగంగా చెప్పుకొచ్చాడు.

# మనం రోజూ తింటున్న ఈ ఆహార పదార్థాల వెనకున్న ఆసక్తికరమైన విషయాలు తెలుసా?

**పిండిని అలాగే ఉంచడంతో ఈస్ట్ ఏర్పడి బ్రెడ్ పుట్టింది**

**జంతువుల జీర్ణాశయ భాగాలతో చేసిన సంచుల్లో పాలను నిల్వచేయడంతో పుట్టిన చీజ్**

**మిరపకాయలను అమెరికా నుంచి పోర్చుగీసు వారు ఇండియాకు తెచ్చారు**

**మొదట మొక్కజొన్న మెక్సికోలో ఓ గడ్డిమొక్క**

**టమాటాలు విషపూరితమని యూరప్ ప్రజలు భావించారు**

**పేకాట ఆపకుండా ఉండడం కోసం బ్రెడ్ మధ్య మాంసం పెట్టడంతో పుట్టిన శాండ్‌విచ్**



చరిత్రను రాజులు, యుద్ధాలు, శాస్త్రీయ ఆవిష్కరణలతోనే గుర్తుంచుకుంటాం. కానీ కొన్ని సాధారణ ఆహార పదార్థాలు కూడా ప్రపంచ చరిత్రను మలుపు తిప్పాయి. కొన్ని అనుకోకుండా వెలుగులోకి వచ్చాయి. మరికొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు, సంస్కృతులు, ప్రజల జీవన విధానాలనే మార్చేశాయి. అలాంటి కొన్ని ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం..

బ్రెడ్: ప్రాచీన ఈజిప్టులో పిండిని కొంతసేపు అలాగే ఉంచడంతో సహజంగా ఈస్ట్ ఏర్పడి మెత్తని బ్రెడ్ తయారైందని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ యాదృచ్ఛిక ఆవిష్కరణ తర్వాత ప్రపంచవ్యాప్తంగా బ్రెడ్ ప్రధాన ఆహారంగా మారింది.

చీజ్: పాలను జంతువుల జీర్ణాశయ భాగాలతో చేసిన సంచుల్లో నిల్వ చేయడంతో అందులోని ఎంజైమ్‌ల కారణంగా పాలు గడ్డకట్టాయి. వాటిని పారేయకుండా తినడం ప్రారంభించడంతో చీజ్ పుట్టిందని అధ్యయనాలు చెబుతున్నాయి. నేడు ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఆహారాల్లో ఇదొకటి.

చాక్లెట్: మొదట మాయా, అజ్టెక్ నాగరికతల్లో చేదు పానీయంగా మాత్రమే ఉపయోగించిన కోకో, యూరప్‌కు వెళ్లిన తర్వాత చక్కెర కలపడంతో చాక్లెట్‌గా మారింది. అప్పటి నుంచి ప్రపంచ వ్యాపారం, ఆహార పరిశ్రమపై దీని ప్రభావం అమోఘంగా మారింది.

మిరపకాయలు: భారతీయ వంటల్లో మిరపకాయలు తప్పనిసరి అయినా అవి భారతదేశానికి చెందినవి కావు. 16వ శతాబ్దంలో పోర్చుగీసు వారు అమెరికా నుంచి తీసుకొచ్చారు. తక్కువ ఖర్చుతో ఎక్కువగా పండటంతో దేశమంతా విస్తరించి భారతీయ వంటకాల రుచినే మార్చేశాయి.

బంగాళాదుంప : 16వ శతాబ్దంలో దక్షిణ అమెరికా నుంచి యూరప్‌కు చేరిన బంగాళాదుంపపై మొదట అనేక అనుమానాలు ఉండేవట! తర్వాత అధిక దిగుబడితో యూరప్ జనాభా పెరగడానికి, ఆర్థికాభివృద్ధికి దోహదపడింది. అయితే ఇదే పంటపై అధికంగా ఆధారపడటం వల్ల 1840ల్లో ఐర్లాండ్‌లో ఘోర కరవు కూడా వచ్చింది.

మొక్కజొన్న : మెక్సికోలో అడవి గడ్డిగా ఉన్న మొక్కజొన్న క్రమంగా ప్రపంచంలోని ప్రధాన పంటల్లో ఒకటిగా ఎదిగింది. ప్రస్తుతం ఇది మనుషుల ఆహారంతో పాటు పశువుల మేత, బయోఫ్యూయెల్స్ వంటి అనేక రంగాల్లో ఉపయోగపడుతోంది.

టమాటా: ఒకప్పుడు టమాటాలు విషపూరితమని యూరప్ ప్రజలు నమ్మేవారు. అందుకే వాటిని అలంకరణ మొక్కలుగా మాత్రమే పెంచేవారు. ఆఅపోహ తొలగిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా వంటల్లో కీలక పదార్థంగా మారిపోయాయి.

ఇన్‌స్టంట్ నూడుల్స్ : రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆహార కొరతను దృష్టిలో పెట్టుకుని 1958లో జపాన్‌కు చెందిన మొమోఫుకు ఆండో ఇన్‌స్టంట్ నూడుల్స్‌ను రూపొందించారు.

కాఫీ: కాఫీ కేవలం నిద్రను పోగొట్టే పానీయం మాత్రమే కాదు. పశ్చిమాసియా, యూరప్‌లో కాఫీ హౌస్‌లు శాస్త్రవేత్తలు, వ్యాపారవేత్తలు, రచయితలు, రాజకీయ నాయకులు కలుసుకునే కేంద్రాలుగా మారి అనేక కొత్త ఆలోచనలకు వేదికయ్యాయి.

యాపిల్: ఐజాక్ న్యూటన్ తలపై యాపిల్ పడిందనే కథ నిజం కాకపోయినా, చెట్టు నుంచి యాపిల్ పడటం చూసిన తర్వాతే గురుత్వాకర్షణపై ఆలోచించడం ప్రారంభించానని న్యూటన్ చెప్పాడు. అందుకే యాపిల్ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించింది.

శాండ్‌విచ్ :

జాన్ మాంటెగూ అనే బ్రిటిష్ ప్రభువు పేకాట ఆడుతూ, ఆట ఆపకుండా తినేందుకు రెండు బ్రెడ్ ముక్కల మధ్య మాంసం పెట్టి ఇవ్వమని కోరాడట. అలా పుట్టిన శాండ్‌విచ్ నేడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రాచుర్యం పొందిన ఆహారాల్లో ఒకటిగా నిలిచింది.

# సినిమా న్యూస్



దివి వడ్యా ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టిస్తోంది దివి వడ్యా తన కొత్త ఇన్‌స్టాగ్రామ్ చిత్రంలో చాలా అందంగా ఉంది. ఆమె తెల్లటి చొక్కా దుస్తులు ధరించి ఉంది. ఆమె హావభావాలు ఫోటోను మరింత ఆకర్షణీయంగా చేస్తాయి.

## సుక్కూ ఫోకస్.. అదే అతిపెద్ద ఛాలెంజ్?



ఒక సినిమా సక్సెస్ తో డైరెక్టర్ రేంజ్ మారిపోతుంది. కానీ ఆ విజయాన్ని మించి మరో సినిమా ఇవ్వాలంటే మాత్రం మరింత కష్టపడాల్సి ఉంటుంది. ప్రస్తుతం స్టార్ డైరెక్టర్ సుకుమార్ పరిస్థితి కూడా అలాగే కనిపిస్తోంది. పుష్ప సిరీస్ తో ఓ రేంజ్ లో క్రేజ్ సంపాదించుకున్న ఆయన.. ఇప్పుడు రామ్ చరణ్ తో చేయబోయే కొత్త సినిమాపై పూర్తి దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈసారి కథతో పాటు టెక్నికల్ టీమ్ ఎంపిక ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. రామ్ చరణ్ లీడ్ రోల్ లో నటించనున్న ఆ సినిమా కోసం ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతుండగా, టెక్నీషియన్ల ఎంపికపై మూవీ టీమ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. సాధారణంగా సుకుమార్ సినిమాల్లో కథ ఎంత స్ట్రాంగ్ గా ఉంటుందో, టెక్నికల్ క్వాలిటీ కూడా అంతే ప్రత్యేకంగా ఉంటుంది. అందుకే సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, ఆర్ట్ డిపార్ట్మెంట్, యాక్షన్ డిజైన్ వంటి విభాగాల్లో ఎలాంటి రాజీ పడకుండా ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. సినిమాటిక్కెట్లు ఆన్‌లైన్ . గతంలో వచ్చిన రంగస్థలం, పుష్ప చిత్రాలు కేవలం కథల వల్లే కాదు.. స్క్రీన్ పై కనిపించిన విజువల్ క్వాలిటీ వల్ల కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

ప్రతి ఫ్రేమ్ లో స్పెషాలిటీ కనిపించేలా సుకుమార్ శ్రద్ధ తీసుకుంటారనే పేరుంది. ఇప్పుడు రామ్ చరణ్ తో చేయబోయే సినిమా స్టైలిష్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న నేపథ్యంలో టెక్నికల్ టీమ్ పాత్ర మరింత కీలకంగా మారనుందని భావిస్తున్నారు. అయితే ఆ ప్రాజెక్ట్ చుట్టూ మరో ఆసక్తికర చర్చ కూడా సాగుతోంది. పుష్ప తర్వాత సుకుమార్ నుంచి వస్తున్న నెక్స్ట్ సినిమా కావడంతో అంచనాలు భారీగా పెరిగాయి. పాన్ ఇండియా రేంజ్ లో విజయం సాధించిన తర్వాత ఆయన వేసే ప్రతి స్టెప్ పై సినీ అభిమానులు, ఎక్స్పర్ట్స్ దృష్టి పెడుతున్నారు. అందుకే ఆ సినిమా ఆయన కెరీర్ లో మరో కీలక పరీక్షగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సుకుమార్ కెరీర్ ను పరిశీలిస్తే ప్రతి సినిమాలో కొత్తదనాన్ని చూపించడానికి ప్రయత్నించారు. ఆర్య నుంచి రంగస్థలం, పుష్ప వరకు ఆయన ఎంచుకున్న కథలు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. అదే ఆయనను ప్రత్యేక దర్శకుడిగా నిలబెట్టింది. ఇప్పుడు కూడా ప్రేక్షకులు ఊహించని కథ, పాత్రలతో ముందుకు రావాలనే టార్గెట్ తో పని చేస్తున్నట్లు తెలుస్తోంది. చరణ్ కూడా ప్రస్తుతం పాన్ ఇండియా రేంజ్ లో భారీ గుర్తింపు పొందిన స్టార్ హీరో. దీంతో ఆ కాంబోపై అంచనాలు మరింత పెరిగాయి. . సెప్టెంబర్ లో సినిమా ప్రారంభమయ్యే అవకాశం ఉందని, దసరా తర్వాత రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. 2027లో విడుదల టార్గెట్ గా ప్లాన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఆ సినిమాకు సంబంధించిన అతిపెద్ద చర్చ కథ కంటే టెక్నికల్ టీమ్ గురించే కనిపిస్తోంది. అదే సమయంలో పుష్ప తర్వాత మరోసారి తన అదరగొడతారా అనే ప్రశ్న సుకుమార్ ముందున్న అతిపెద్ద ఛాలెంజ్!

## మారుతోన్న ప్రేక్షకుల అభిరుచి!



డిజిటల్ యుగంలో ప్రేక్షకుడి అభిరుచి వేగంగా మారుతోంది. ముఖ్యంగా జెన్-జీ తరం ప్రేక్షకులు మొబైల్ ఫోన్లలో ప్రపంచంలోని ఏ మూలన ఉన్న అద్భుతమైన కంటెంట్‌నైనా క్షణాల్లో చూడగలుగు తున్నారు. హాలీవుడ్ చిత్రాల విజువల్ వండర్స్ నుండి కొరియన్ సిరీస్‌ల భావోద్వేగాల వరకు గ్లోబల్ కంటెంట్ తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యింది. ఈ నేపథ్యంలో దశాబ్దాలుగా అలరిస్తున్న సంప్రదాయ దేశీయ చిత్రాలు, కొత్త తరం ఆశించే అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడంలో కొంత వెనుకబడుతు న్నాయన్నది వాస్తవం. తెలుగుసినిమా హాలీవుడ్ - కొరియన్ కంటెంట్ విజయానికి ప్రధాన కారణం వారి ప్రీ-ప్రొడక్షన్- కథా నిబద్ధత. ఒక సినిమా షూటింగ్ మొదలవ్వకముందే? స్క్రిప్ట్ స్థాయి నుండి ప్రతి చిన్న అంశాన్ని పక్కాగా సిద్ధం చేసుకుంటారు. విజువల్ ఎఫెక్ట్స్, సినిమాటోగ్రఫీ, సౌండ్ డిజైన్ వంటి సాంకేతిక అంశాలపై చూపే శ్రద్ధ, ప్రేక్షకులను ఒక మాయా ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఇంకా చాలా వరకు మేకింగ్ కంటే కూడా స్టార్ డమ్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటం అంత ర్జాతీయ పోటీలో వెనుకబడిపోవడా నికి ప్రధాన కారణంగా కనిపిస్తోందన్నది పచ్చి నిజం. జెన్-జీ తరం ప్రేక్షకుడు కేవలం కథను మాత్రమే చూడటం లేదు. ఆ కథను ప్రెజెంట్ చేసిన విధానాన్ని కూడా గమనిస్తున్నాడు. లాజిక్ లేని సన్నివేశాలు, సాగదీసే కథనాలు, పాతబడిన ఫార్మాట్లు విసుగు కలిగిస్తు న్నాయి. గ్లోబల్ కంటెంట్ చూస్తున్న ప్రేక్షకుడికి దేశీయ చిత్రాల్లో అదే స్థాయి నాణ్యత , కొత్తదనం కనిపించాలి. అందుకే? కథాంశం ఎంత బలంగా ఉన్నా? దానిని ప్రెజెంట్ చేసే విధానంలో కూడా అంతర్జాతీయ ప్రమాణాలు ఉండటం నేటి అవసరం. ఈ మార్పును గమనించిన దర్శకులు కొందరు ఇప్పటికే భారీ బడ్జెట్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటుతున్నారు. అయితే పెద్ద సినిమాలకే పరిమితం కాకుండా చిన్న సినిమాల నుంచి కూడా అత్యుత్తమ కంటెంట్ రావాల్సిన అవసరం ఉంది. ప్రీ-ప్రొడక్షన్ దశలో చేసే ప్రతి చిన్న ప్రయత్నం తుది ఉత్పత్తిలో స్పష్టమైన మార్పును చూపిస్తుంది. టెక్నాలజీని ఎలా ఉపయోగిస్తున్నాం అనేదాని కంటే? ఆ టెక్నాలజీ ద్వారా ప్రేక్షకుడికి ఎలాంటి అనుభూతిని ఇస్తున్నాం? అన్నదే కీలకం. ఇకనైనా దర్శక, నిర్మాతలు ప్రేక్షకుడి పల్స్ ను పట్టుకోవాల్సిన సమయం ఆసన్నమైందని గమనించాలి. గ్లోబల్ కంటెంట్‌కు పోటీగా నిలవాలంటే? స్టార్ పవర్ కంటే కంటెంట్ పవర్ పెరగాలి. అంతర్జాతీయ స్థాయిలో వెనకబ డిపోయామని బాధపడటం కంటే మన దగ్గర ఉన్న అద్భుతమైన కథలను అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో తెరకెక్కించడం ద్వారానే గ్లోబల్ ఆడియన్స్‌ను ఆకట్టుకోగలమని బలంగా నమ్మాలి. ప్రేక్షకుడు ఇప్పుడు చాలా తెలివైనవాడు. అతను కోరుకునేది వినోదం మాత్రమే కాదు. ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసే అనుభవాన్ని ఆశిస్తున్నారు. మారిన అభిరుచులకు అనుగుణంగా చేంజ్ అనేది సినిమా రంగానికి తప్పనిసరి. కంటెంట్ నాణ్యతలో రాజీ పడకుండా ప్రతి అడుగులోనూ కొత్తదనాన్ని వెతుక్కుంటే? మన చిత్రాలు కూడా ప్రపంచవ్యాప్తంగా విజయఢంకా మోగిస్తాయి. ప్రేక్షకుడి పల్స్ పట్టుకుని వారిని అలరించే అద్భుతమైన కథలతో మనం సిద్ధమైతే? గ్లోబల్ మార్కెట్‌లో తెలుగు సినిమా స్థాయి మరింత పెరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## సస్పెన్స్ ముందే బయటికొస్తే... ఆడియన్స్ ఆసక్తి తగ్గిపోతుందా?

సినిమా చూసేటప్పుడు థియేటర్‌లో వచ్చే ఒక్క సీన్ మనల్ని షాక్‌కి గురిచేస్తే ఆ మజానే వేరు. అందుకే మేకర్స్ కథలో ఏదో ఒక పెద్ద ట్విస్ట్ పెడుతుంటారు. కానీ, ఆ ట్విస్ట్ కాస్త రిలీజ్ కాకుండానే బయటపడిపోతే? ప్రస్తుతం టాలీవుడ్‌ను వేధిస్తున్న అతిపెద్ద సమస్య ఇదే. సోషల్ మీడియా లీకులు, పోస్ట్-ప్రొడక్షన్ వర్క్ ద్వారా సీక్రెట్స్ అన్ని ముందే బయటికొచ్చేస్తున్నాయి. మరి ఈ లీకుల వల్ల థియేటర్ ఎక్స్‌పీరియన్స్ దెబ్బతింటోందా అంటే.. కచ్చితంగా అవుననే చెప్పాలి. ఆ వివరాలు చూద్దాం . లీకుల శాపం.. థియేటర్ థ్రిల్ గాయపడింది: ఈ రోజుల్లో ఒక సినిమాలోని మేజర్ ట్విస్ట్‌ని సీక్రెట్‌గా ఉంచడం దర్శకులకు పెద్ద సవాలుగా మారింది. ఎడిటింగ్ రూమ్స్, డబ్బింగ్ స్టూడియోల నుంచి లేదా సోషల్ మీడియా ప్రచారం వల్ల కథలోని అసలు షాకింగ్ ఎలిమెంట్స్ ముందే లీక్ అయిపోతున్నాయి. ఇటీవలి సినిమాల్లో హీరో పాత్రకు పెద్ద ట్విస్టులు ప్లాన్ చేస్తున్నారు.. కానీ సినిమా థియేటర్‌లోకి రాకముందే ఆ షాకింగ్ ఎలిమెంట్ ఏంటో అందరికీ తెలిసిపోవడంతో ఆడియన్స్‌కి ఆ క్షణంలో కలగాల్సిన కిక్, థ్రిల్ పూర్తిగా తగ్గిపోతున్నాయి. సినిమాటిక్కెట్లు ఆన్‌లైన్ బాహుబలి ట్రెండ్.. కంటెంట్ ఉంటే కొట్టొచ్చు: లీకులు కథలకి శాపమే అయినా, గతంలో కొన్ని సినిమాలు ఈ లీకుల భయాన్ని కూడా దాటుకుని బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాయి. 'అత్తారింటికి దారేది' సినిమా ఆన్‌లైన్‌లో లీక్ అయినా, 'బాహుబలి'కి సంబంధించిన కొన్ని ముఖ్యాంశాలు ముందే బయటికొచ్చినా ఆ సినిమాలు ఇండస్ట్రీ హిట్స్‌గా నిలిచాయి. దానికి కారణం ఆ సినిమాల్లోని బలమైన ఎమోషన్స్ మరియు కంటెంట్. లీక్ ద్వారా ట్విస్ట్ తెలిసినా, దాన్ని తెరపై దర్శకుడు చూపించిన తీరు నచ్చితే ప్రేక్షకులు ఖచ్చితంగా థియేటర్లకి వస్తారని ఈ సినిమాలు నిరూపించాయి. ట్విస్టులు దాచడం సాధ్యమేనా?: చివరగా చెప్పాలంటే, కథలో ఎంతటి ఊహించని మలుపులు ఉన్నా, అవి రిలీజ్‌కు ముందే బయటపడిపోతే సగటు ప్రేక్షకుడి చూసే అనుభూతి ఖచ్చితంగా దెబ్బతింటుంది. కేవలం ట్విస్ట్ మీదే ఆధారపడే క్రైమ్, సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలకైతే ఇది మరింత పెద్ద దెబ్బ. చిత్ర యూనిట్ ఎంత జాగ్రత్తగా ఉన్నా ఈ లీకులను ఆపడం కష్టంగా మారుతోంది. కేవలం ట్విస్టులనే నమ్ముకోకుండా, స్క్రీన్‌ప్లే, ఎమోషన్స్‌ను బలంగా రాసుకుంటేనే లీక్స్‌ని తట్టుకుని థియేటర్లలో సినిమాలు నిలబడగలవు.




Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662